సాక్షి
కుమురం భీం

బుధవారం ॥ 24 ॥ మే ॥ 2023



మామిడిపై 'మంగు' పంజా

మంగు తెగులు కారణంగా మామిడికి ధర రావడం లేదు. పండ్లలో పురుగులు ఉన్నాయని వినియోగదారుల నుంచి ఫిర్యాదు వస్తున్నాయి. 8లో ▸



గాలివాన బీభత్సం

దహెగాం, కాగజ్‌నగర్ మండలంతోపాటు పట్టణాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. గాలివానకు పలుచోట్ల రోడ్లపై చెట్లు విరిగి పడ్డాయి. 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
42.5 /29.8

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమౌతుంది. ఎండ తీవ్రత కొనసాగుతుంది. మధ్యాహ్నం తర్వాత వేడి, ఉక్కపోత అధికంగా ఉంటాయి. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జేపీఎస్‌ల సంబురాలు



కలెక్టర్ హేమంత్ బోర్కడేకు కృతజ్ఞతలు తెలుపుతున్న జేపీఎస్‌లు

ఆసిఫాబాద్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంతో జిల్లాలోని జేపీఎస్‌లు సంబురాలు జరుపుకొన్నారు. మంగళవారం కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ని జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు తమను కూడా జేపీఎస్‌లుగా మార్చాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ, మండల అధ్యక్షుడు సంతోష్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. ఆసిఫాబాద్ మండలంలోని గిరిజన గ్రామం మాలన్‌గొందిలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మొబైల్ మెడికల్ ఆస్పత్రిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొదటి రోజు 53 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ, సర్పంచ్ పార్వతి, తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి కుమురంభీం ప్రాజెక్ట్ భూమిపూజ చేసినా ఇప్పటివరకు ఒక్క ఎకరం భూమి కూడా తడవలేదని ఆరోపించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం, వార్ధా ప్రాజెక్టుల పేరిట కోట్లు ఖర్చు చేస్తున్నా కుమురంభీం ప్రాజెక్టు నీటిని రైతులకు అందించలేకపోతున్నారని మండిపడ్డారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

నకిలీ విత్తనాల విక్రయాలపై ప్రత్యేక నిఘా




మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: నకిలీ విత్తనాల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సంతోష్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం వ్యవసాయ అధికారులు, ఫర్టిలైజర్ దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నకిలీ విత్తనాల సరఫరా, క్రయవిక్రయాలపై తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఎస్పీ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను మోసగిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, సరఫరా చేసినా జైలుకు పంపుతామన్నారు. వానాకాలం సాగును దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో నకిలీ విత్తనాల సరఫరా, ఉత్పత్తి, అమ్మకాలను అరికట్టడానికి వ్యవసాయ, పోలీస్‌శాఖ సంయుక్తంగా మండల స్థాయిలో ప్రత్యేక స్పెషల్ టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీస్ బృందాలు ఎప్పటికప్పుడు తనిఖీలు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వ్యాపారులు, సంస్థలు, వ్యక్తులు నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే పోలీసులు, డయల్ 100, 63024 30500 నంబర్‌లో సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కాగజ్‌నగర్ టౌన్ సీఐ బుద్ధ స్వామి, కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, సాదిక్ పాషా, వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్‌లో సత్తా చాటారు

- ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు
- 35వ ర్యాంకుతో అదరగొట్టిన సంకేత్

చెన్నూర్‌రూరల్/దండేపల్లి/లక్సెట్టిపేట/రెబ్బెన: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన నలుగురు యువకులు సివిల్స్‌లో సత్తా చాటారు. మంగళవారం వెలువడిన యూపీఎస్సీ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 35వ, 410వ, 640వ, 742వ ర్యాంకులు సాధించారు. మొదటి ప్రయత్నంలో విఫలమైనా పట్టు వదలకుండా.. కుంగిపోకుండా మరోసారి ప్రయత్నించి లక్ష్యం నెరవేర్చుకున్నారు. ఎంతోమంది యువతలో స్ఫూర్తి నింపారు. నలుగురిదీ వేర్వేరు నేపథ్యం అయినా ఒకటే లక్ష్యంగా కష్టపడి చదివి జాతీయ స్థాయిలో మెరిశారు. వీరిలో ఒకరు కలెక్టర్ అయ్యే అవకాశం ఉంది.



తల్లి, కుటుంబ సభ్యులతో సివిల్స్ ర్యాంకర్ రేవయ్య

మెరిసిన పేదింటి విద్యాకుసుమం

కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను ఉన్నత స్థాయికి చేర్చాలకున్న ఆ తల్లి పడిన కష్టానికి ఫలితం దక్కింది. మాతృమూర్తి కలను సాకారం చేస్తూ రెండో కుమారుడు సివిల్స్‌లో ఆలిండియా స్థాయిలో సత్తా చాటాడు. కుమురంభీం జిల్లా రెబ్బెన మండలం తుంగెడకు చెందిన విస్తారుబాయి, మనోహర్ దంపతులకు ముగ్గురు సంతానం. మనోహర్ 25 ఏళ్ల క్రితమే మృతి చెందాడు. అప్పటి నుంచి పిల్లల భారం తల్లి విస్తారుబాయిపై పడింది. వారిని ఉన్నత స్థాయికి చేర్చేందుకు రెక్కలుముక్కలు చేసుకుంది. దొరికిన కూలీ పనులు చేసుకుంటూ పెంచి పెద్ద చేసింది. ప్రస్తుతం తుంగెడ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పని చేస్తోంది. పెద్ద కుమారుడు తిర్యాణి మండలంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తుండగా, కూతురు స్వప్న ఎన్ఐటీ నాగ్‌పూర్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేసి ప్రస్తుతం ఉద్యోగ ప్రయత్నంలో ఉంది. రెండో కుమారుడు రేవయ్య సివిల్స్‌లో 410 వ ర్యాంకు సాధించాడు.

రెండో ప్రయత్నంలో విజయం..

ఐఐటీ మద్రాస్‌లో కెమికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన రేవయ్య కొన్నాళ్లు ఓఎన్‌జీసీలో ఉద్యోగం చేశాడు. ఆ ఉద్యోగంతో సంతృప్తి చెందని అతను సివిల్స్ వైపు దృష్టి సారించాడు. మొదటి ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లగా, రెండో ప్రయత్నంలో 2022 సివిల్స్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 410వ ర్యాంకు సాధించాడు.

కష్టపడి చదువుకున్నడు

రేవయ్యకు చదువు అంటే ఎంతో ఇష్టం. చిన్నప్పటి నుంచే ఎంతో కష్టపడి చదువుకున్నడు. పిల్లల చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడంతో చదువులకు మస్తు ఇబ్బందైంది. ఇంజినీరింగ్ సీటు మద్రాసుల వస్తే చదువుకు అందరూ సహకరించారు. సివిల్స్ కోసం ఉద్యోగం మానేసి రాత్రి, పగలు చదువుకున్నాడు. నా కొడుకు పడిన కష్టానికి ఫలితం లభించింది.

– విస్తారుబాయి, రేవయ్య తల్లి

గిరిజన బిడ్డ ఇక కలెక్టర్‌గా...



సంకేత్‌కుమార్

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కర్ణపేటకు చెందిన గిరిజన బిడ్డ అజ్మీరా సంకేత్‌కుమార్(26) కష్టపడి చదివి ఆలిండియా స్థాయిలో 35వ ర్యాంకు సాధించాడు. దేశస్థాయిలో కర్ణపేట, జిల్లా పేరును మార్మోగించాడు. తండ్రి అజ్మీరా ప్రేమ్‌సింగ్‌నాయక్ ఉద్యానవన శాఖ ఉద్యోగి కాగా, తల్లి సవిత ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. సంకేత్‌కుమార్ ప్రాథమిక విద్యను కర్ణపేట, ఇంటర్ హైదరాబాద్‌లోని ప్రైవేటు కాలేజీ, ఐఐటీ(ఢిల్లీ)లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. అదే కాలేజీలో మాస్టర్ ఆఫ్ రీసెర్చ్ (ఎమ్మార్)లో బంగారు పతకం సాధించాడు. ఏడాదిపాటు జపాన్‌లోని ఓ కంపెనీలో రీసెర్చ్ ఇంజినీర్‌గా చేశాడు. ఐఏఎస్ కావాలనే దృఢ సంకల్పంతో సివిల్స్‌కు సన్నద్ధమయ్యాడు. 2021లో తొలిప్రయత్నంలో విఫలమైనా 2022లో మరోసారి ప్రయత్నించి అత్యుత్తమ ర్యాంకు సాధించాడు. ఐఏఎస్‌కు అర్హత పొందాడు. ''గిరిజనులు, నిరుపేదలకు సేవ చేసేందుకు కలెక్టర్ కావాలనుకున్నా.. ఆ మేరకు కష్టపడి చదివాను.. ఆల్ ఇండియా స్థాయిలో 35వ ర్యాంకు రావడం సంతోషంగా ఉంది..'' అంటూ సంకేత్‌కుమార్ 'సాక్షి'తో తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు.

గర్వపడుతున్నాం

కలెక్టర్ కావాలనే ఆకాంక్షను నెరవేర్చేందుకు మేము ప్రోత్సహించాం. మొదటి ప్రయత్నంలో రాకపోయినా బాధపడకుండా కలెక్టర్ కావాలనే లక్ష్యంతో రెండోసారి మంచి ర్యాంకు సాధించాడు. తన చిరకాల కోరిక నెరవేర్చుకున్నందుకు తల్లిదండ్రులుగా ఎంతో గర్విస్తున్నాం.

–సంకేత్ తల్లిదండ్రులు
అజ్మీరా ప్రేమ్‌సింగ్, సవిత

రెండో ప్రయత్నంలో..



తుమ్మల సాయికృష్ణ

మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం సోమనపల్లికి చెందిన తుమ్మల రాజశేఖర్‌రెడ్డి, సంతోష దంపతులది వ్యవసాయ నేపథ్య కుటుంబం. పెద్ద కుమారుడు హైదరాబాద్‌లోని ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండో కుమారుడు సాయికృష్ణారెడ్డి చిన్నప్పటి నుంచే సివిల్స్ రాయాలనే పట్టుదలతో చదివాడు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చెన్నూర్‌లోని ప్రైవేటు పాఠశాలలో అభ్యసించాడు. హైదరాబాద్‌లోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. అనంతరం నీట్ వరంగల్ లో చదివాడు. కరోనా సమయంలో ఆన్‌లైన్‌లో సివిల్స్ శిక్షణ పొందాడు. హైదరాబాద్‌లో గది అద్దెకు తీసుకొని రెండేళ్లు సివిల్స్‌కు సన్నద్ధం అయ్యాడు. మొదటగా 2021లో సివిల్స్ రాశాడు. కానీ మెయిన్స్‌లో రాకపోవడంతో మళ్లీ 2022లో పట్టుదలతో చదివి సివిల్స్ రాశాడు. రెండో ప్రయత్నంలో 640వ ర్యాంకు సాధించాడు. ఈ ర్యాంకుకు జనరల్ కేటగిరీలో ఐఏఎస్, ఐపీఎస్ పొందలేకపోయినా మెరుగైన ర్యాంకుతో జిల్లా పేరు నిలబెట్టాడు. కుమారుడు సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందని సాయికృష్ణ తల్లిదండ్రులు తెలిపారు.

మూడోసారికి సక్సెస్



సాయినాథ్

మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం బలరావుపేట గ్రామానికి చెంది న రాందేని సాయినాథ్ సివిల్స్‌లో పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నించి సక్సెస్ సాధించాడు. 742వ ర్యాంకు సాధించాడు. గ్రామానికి చెందిన చంద్రమౌళి, కవిత దంపతులకు కుమారులు సాయినాథ్, యశ్వంత్ ఉన్నారు. సాయినాథ్ 7వ తరగతి వరకు నస్పూర్‌లో, పదో తరగతి వరకు హైదరాబాద్‌లో చదివాడు. ఇంటర్మీడియెట్ కరీంనగర్‌లోని ప్రైవేటు కళాశాలలో చదివి బీటెక్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేసి సివిల్స్‌పై దృష్టి సారించాడు. 2019లో మొదటిసారిగా పరీక్షకు హాజరై ప్రిలిమ్స్‌లో ఫెయిలయ్యాడు. రెండోసారి ఇంటర్వ్యూ వరకు వెళ్లి 15మార్కులతో విఫలమయ్యాడు. పట్టు వదలకుండా మూడోసారి ప్రయత్నించడంతో 742వ ర్యాంకు సాధించాడు. ''ఆంథ్రోపాలజీ సబ్జెక్టును ఎంచుకుని శిక్షణ తీసుకున్నాను. తర్వాత సొంతంగా ప్రిపేర్ అవుతూ ప్రతీరోజు ఒక టాపిక్ ఎంచుకుని లక్ష్యాన్ని సాధించాను. మొదట కొంచెం బాధగా అనిపించినా తర్వాత కష్టపడుతూ విజయం సాధించాను..'' అని సాయినాథ్ తెలిపాడు.

'గిరి వికాస్' పకడ్బందీగా అమలు చేయాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, పక్కన ఎమ్మెల్యే సక్కు, అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్: జిల్లాలో గిరివికాస్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా గ్రామీణాభివృద్ధి, విద్యుత్ శాఖ అధికారులతో గిరివికాస్ పథకం అమలు తీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జియాలజికల్ సర్వే పూర్తి చేసి, వ్యవసాయ బావులు తవ్వించి విద్యుత్ సౌకర్యం కల్పించి రైతులు వ్యవసాయం సాగు చేసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. వ్యవసాయ బావులకు మోటార్లు బిగించి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కనెక్షన్ అందించాలన్నారు. విద్యుత్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అనంతరం నీటిపారుదల ప్రాజెక్టులు, చెరువులు, కాల్వలపై అధికారులతో సమీక్షించారు. చెరువులు, కాల్వలకు అవసరమైన మరమ్మతులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతేడాది వర్షాలతో దెబ్బతిన్న చెరువులు, కాల్వల మరమ్మతులపై దృష్టి సారించాలన్నారు. వట్టివాగు, అడ, చెలిమెల ప్రాజెక్టుల చివరి ఆయకట్టు వరకు నీరందించే విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. కాల్వల్లో చెత్త, మట్టిని ఉపాధిహామీ పథకం కింద తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో రాజేశ్వర్, డీఆర్‌డీవో సురేందర్, ఏపీవో కుటుంబరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ వాసుదేవ్, ఇంజనీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పత్తి వ్యాపారి అక్రమ దందా

- రైతులతో గంజాయిని అంతర పంటగా వేయిస్తున్న వైనం
- మారుమూల ప్రాంతాల్లో గుట్టుగా సాగు
- ఆసిఫాబాద్ అడ్డాగా వ్యాపారం
- నాలుగైదేళ్లలో రూ.కోట్ల సంపాదన



సాక్షి, ఆసిఫాబాద్: ఒకప్పుడు అతనో అనామకుడు. ఆస్తిపాస్తులు అంతగా లేవు. ప్రస్తుతం రూ.కోట్ల ఆస్తులు కూడగట్టాడు. అతనికేదో లాటరీ తగలిందని అనుకునేరు. తన క్రిమినల్ బుర్రను ఉపయోగించి.. అమాయక గిరిజన రైతులను మచ్చిక చేసుకుని పత్తి, కంది చేలల్లో అంతర పంటగా గంజాయి సాగు చేయిస్తూ నాలుగైదేళ్లలో రూ.కోట్లకు పడగలెత్తాడు. ఆసిఫాబాద్ అడ్డాగా గంజాయి దందాను యథేచ్ఛగా చేస్తూ ఇప్పుడు రియల్టర్ ముసుగులో తిరుగుతున్నారు. అతడిని పట్టుకోవాలని పోలీసులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఏడాదిన్నర కిందట కెరమెరి మండలం సావర్‌ఖేడా వద్ద పోలీసులు గంజాయి ముఠా సభ్యులను పట్టుకున్నా అతను మాత్రం తృటిలో తప్పించుకోవడం గమనార్హం.

అంతర పంటగా గంజాయి..

జిల్లాలో మారుమూల ప్రాంతాలైన సావర్‌ఖేడా, ఉమ్రి, నిషాని, దేవుడిపల్లి, గోయిగాం, ధనోరా, కోతారి, ఇందాపూర్ తదితర గ్రామాల్లో రైతులు కంది, పత్తి పంటలు సాగుచేస్తున్నారు. ఆయా గ్రామాల రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేసే ఓ వ్యాపారి వారితో ఈ నిషేధిత గంజాయిని అంతర పంటగా సాగు చేయిస్తున్నట్లు సమాచారం. పత్తి కూడా జీరో వ్యాపారం చేస్తున్నట్లు వినికిడి. ఇక అనామతుగా పత్తిని వ్యాపారి వద్ద ఉంచే రైతులు తమకు అవసరమైనప్పుడు అతడి వద్ద నుంచి డబ్బులు తీసుకుంటారని తెలుస్తోంది. అదే విధంగా జూన్, జూలై నెలల్లో ఆ వ్యాపారి రైతులకు పంటలకు అవసరమైన యూరియా, డీఏపీని అందజేస్తూ.. వారిని మచ్చిక చేసుకున్నాడని స్థానికులు పేర్కొంటున్నారు. గత నాలుగైదేళ్లుగా ఇలా చట్టవిరుద్ధంగా గంజాయిని పండించి అక్రమంగా మహారాష్ట్ర, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్రమ రవాణా ద్వారా రూ.కోట్లు ఆర్జించినట్లు సమాచారం. పోలీసులు సైతం గంజాయి సాగుపై ఉక్కుపాదం మోపుతున్నప్పటికీ అసలైన స్మగ్లర్ మాత్రం వారికి చిక్కడం లేదు.

అనతికాలంలోనే రూ.కోట్ల ఆస్తులు

అక్రమంగా సంపాదించిన సొమ్ముతో గంజాయి డాన్ అనతికాలంలో రూ.కోట్ల విలువైన ఆస్తులను కూడబెట్టడం విశేషం. అందులో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రూ.3కోట్ల విలువజేసే ఓ కాంప్లెక్స్ ఉంది. హైదరాబాద్‌లోని ఓ స్టార్ హోటల్ సమీపంలో ఇటీవలే రూ.2.30 కోట్లు పెట్టి ఓ విల్లాను కొనుగోలు చేశాడు. అలాగే ఆసిఫాబాద్‌లో రూ.లక్షల విలువైన పది నుంచి పదిహేను ప్లాట్లు వరకు ఉన్నాయి. తాజాగా గుండి రోడ్డులో ఓ భవనం కొనుగోలులోనూ అతడు వాటాదారుడని తెలిసింది.

విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, ప్రజాప్రతినిధులు

- రాష్ట్రస్థాయి పోటీలకు 180 మంది ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు మంగళవారం ముగిశాయి. సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ హేమంత్ బోర్కడే, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, రాజేశం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడల బలోపేతానికి కృషి చేస్తామన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రతీ మండలంలో ఒక వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో క్రీడామైదానం ఏర్పాటు కోసం పన్నెండెకరాల స్థలం కేటాయించామని, దీనికి సంబంధించి నిధులు కూడా మంజూరైనట్లు వెల్లడించారు. పీడీలు, పీఈటీలు ప్రతీ విద్యార్థిని మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. జాతీయస్థాయిలో ప్రతిభ చూపిన కరీనాను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని అన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలని ఎమ్మెల్యే సక్కు ఆకాంక్షించారు. జిల్లా నుంచి 180 మంది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ టీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, డీఎస్‌వో మణెమ్మ, ఇన్‌చార్జి డీపీవో సురేందర్, కోచ్‌లు విష్ణుకాంత్, విద్యాసాగర్, అరవింద్, రాకేశ్, తిరుపతి, రవి, సాయి తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు జూన్ 2న ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, వైద్యారోగ్య శాఖ అధికారులతో న్యూట్రిషన్ కిట్, ఆరోగ్య పథకాలు, తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని జిల్లాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, ఆరోగ్య మహిళా కేంద్రాలను ఏర్పాటు చేసి ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తోందని తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమంతో ప్రజల నేత్ర సమస్యలు పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఉపాధిహామీ కూలీలకు సైతం సీపీఆర్‌పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హేమంత్ బోర్కడే, వైద్యారోగ్యశాఖ అధికారులతో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్నిశాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్నామన్నారు. ఉప కేంద్రాలు, పల్లె దవాఖానల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వైద్యకళాశాల నిర్మాణ పనులు వేగంగా చేపడుతున్నట్లు వివరించారు. జిల్లాలో కంటి వెలుగు రెండో విడత విజయవంతంగా సాగుతుందన్నారు. వీసీలో డీఎంహెచ్‌వో రామకృష్ణ, పంచాయతీరాజ్ ఈఈ రామ్మోహన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయికి ఎదగాలి



పోటీలు ప్రారంభిస్తున్న జీఎం దేవేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామస్థాయి నుంచి క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం సీఎం కప్ జిల్లా స్థాయి స్విమ్మింగ్ పూల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. జీఎం మాట్లాడుతూ సింగరేణి ప్రాంత యువకుల కోసం సంస్థ అనేక క్రీడా వసతులు కల్పిస్తోందన్నారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలతోపాటు పరిసర ప్రాంతాల యువకులు వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా స్థాయి పోటీలకు అన్ని సౌకర్యాలను యాజమాన్యం కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం తిరుమల్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్, డీజీఎం సతీశ్‌బాబు, ఎంఈవో వెంకటేశ్వరస్వామి, గోలేటి సర్పంచ్ సుమలత, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, పీఈటీ భాస్కర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్‌ఎంఈ ప్లాంట్ కోసం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్కేపీ రెస్క్యూ స్టేషన్ సమీపంలో ఎస్‌ఎంఈ (సైట్ మిక్స్‌డ్ ఎమల్షన్) ప్లాంట్ ఏర్పాటుకు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. ఓసీల్లో బ్లాస్టింగ్ కోసం వినియోగించే ఎక్స్‌ప్లోజర్స్‌ను తయారు చేసే ప్లాంట్‌ను త్వరగా ఇక్కడ ఏర్పాటు చేయనున్నట్లు ఏరియా జీఎం మోహన్‌రెడ్డి తెలిపారు. ఐవోసీఎల్ డీజీఎం మండల్, ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏజీఎం నాగరాజు, ఏజెంట్ రామదాసు, ఎస్వో జయంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లిలో డీపీవో ఆకస్మిక పర్యటన



రికార్డులు తనిఖీ చేస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామంలో మంగళవారం డీపీవో వెంకటేశ్వర్‌రావు ఆకస్మికంగా పర్యటించారు. పంచాయతీలో పలు అంశాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ముందుగా పంచాయతీ కార్యాలయంలోని రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. రికార్డుల నిర్వహణలో పలు సూచనలు చేశారు. అనంతరం పంచాయతీ యాప్‌ను పరిశీలించి కంపోస్ట్ షెడ్, నర్సరీ, వైకుంఠధామం, క్రీడా ప్రాంగణాలను పర్యవేక్షించాలన్నారు. నిర్వహణలో నిర్లక్ష్యం పనికి రాదని సూచించారు. పంచాయతీ సిబ్బందితో నిరంతరం పని చేయిస్తూ ఉండాలని చెప్పారు. అలాగే పారిశుధ్య పనులు పరిశీలించి సూచనలు చేశారు. డీపీవో వెంట ఎంపీవో శ్రీనివాసరెడ్డి, డీపీఎం నరేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రతిభ ఉన్నారు.

పురుగుల మందు తాగి బాలుడి ఆత్మహత్య



రవితేజ మృతదేహం

బెజ్జూర్: పురుగుల మందు తాగి బాలుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రెబ్బెన గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెబ్బెన గ్రామానికి చెందిన నాయిని రవితేజ (15) గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన పోచమ్మ బోనాల వేడుక చూసేందుకు వెళ్తానని ఇంట్లో చెప్పగా తల్లి మందలించింది. దీంతో రవితేజ రాత్రి భోజనం చేయకుండానే నిద్రపోయాడు. మంగళవారం ఉదయం తల్లిదండ్రులు పనులకు వెళ్లగా ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన రవితేజ సోదరుడు కుటుంబీకులకు సమాచారం అందించాడు. వెంటనే అతడిని చికిత్స కోసం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. తండ్రి రంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బెజ్జూర్ ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

అత్యవసరం.. అత్యధిక రుసుం



మంచిర్యాల రైల్వేస్టేషన్

- సమస్యల్లో మంచిర్యాల రైల్వేస్టేషన్
- టాయిలెట్స్ వద్ద అధిక వసూళ్లు
- తాగునీటికి నోచుకోని ప్రయాణికులు
- 'అమృత్'కు ఎంపికైనా మారనితీరు

మంచిర్యాలక్రైం: ఉత్తర, దక్షిణ భారతాన్ని కలిపే కీలకమైన రైల్వేమార్గంలోని మంచిర్యాల రైల్వేస్టేషన్ 'ఏ' గ్రేడ్ స్థానాన్ని కలిగి ఉంది. పైగా ఇటీవల అమృత్ పథకం కింద అమృత్ స్టేషన్‌గా ఎంపికైంది. ఇక్కడి నుంచి రోజుకు వేలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే అతి పెద్ద రైల్వేస్టేషన్ ఇది. ఇంతవరకు బాగానే ఉన్నా ఇక్కడ వసతుల లేమితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండడం విస్మయానికి గురిచేస్తోంది.

నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు

స్టేషన్‌లోని ఒకటో ప్లాట్‌ఫాం చివరలో ఏర్పాటు చేసిన టాయిలెట్స్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. అత్యవసరమేర్పడి అక్కడికి వెళ్తున్న ప్రయాణికులు నిర్వాహకులు చుక్కలు చూపిస్తున్నారు. రూ.10 ఇవ్వందే లోనికి అనుమతించరు. ఈ విషయంలో మహిళల పరిస్థితి మరీ దారుణం. ఎవరైనా రైల్వే అధికారులు స్టేషన్‌ను విజిట్ చేస్తే ఆరోజు హడావుడి చేస్తుంటారు. పూర్తి వసతులున్నట్లు చూపిస్తారు. ఇటీవల రైల్వే జనరల్ మేనేజర్ పర్యటన సందర్భంగా టాయిలెట్స్ వద్ద దేనికి ఎంత చార్జి తీసుకోవాలో సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. తెల్లవారేసరికి దాన్ని తొలగించారు. వాస్తవానికి రైల్వేస్టేషన్‌లోని టాయ్‌లెట్స్‌ను టెండర్ పద్ధతి ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగిస్తారు. కాంట్రాక్టర్ రైల్వేశాఖ నిర్ణయించిన ప్రకారం.. మూత్ర విసర్జనకు రూ.1, మరుగుదొడ్డి వినియోగానికి రూ.2, స్నానం చేసేందుకు రూ.5 మాత్రమే వసూలు చేయాలి. కానీ.. సదరు కాంట్రాక్టర్ మూత్ర విసర్జన, మరుగుదొడ్డి వినియోగానికి రూ.10, స్నానానికి రూ.15 వసూలు చేస్తున్నట్లు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రైల్వేస్టేషన్‌లో చల్లని తాగునీరు లభించదు. వేసవి దృష్ట్యా స్టేషన్‌లోని మూడు ప్లాట్‌ఫాంలపై నాలుగు చల్లని తాగునీటి యంత్రాలను ఏర్పాటు చేయగా, ఇందులో ఒక్కటే పని చేస్తోంది.

ఒక్కరోజుకే పేయింగ్ బోర్డు

ఇటీవల రైల్వే అధికారులు చేపట్టిన రైల్వేస్టేషన్ల పర్యటన సందర్భంగా మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో టాయిలెట్స్ దగ్గర రైల్వేశాఖ నిర్ణయించిన రుసుముతో పే అండ్ యూస్ బోర్డు ఏర్పాటు చేశారు. మరుసటిరోజే దానిని తొలగించారు. ప్రస్తుతం టాయిలెట్స్ వద్ద ఎలాంటి బోర్డు లేదు. ప్రయాణికుల వద్ద అధిక రుసుము వసూలు చేస్తూ.. అడిగితే 'దిక్కున్న చోట చెప్పుకో' అంటూ దురుసుగా ప్రవర్తిస్తున్న సందర్భాలనేకం.



తనిఖీ సమయంలో ఏర్పాటు చేసిన బోర్డు



ప్రస్తుతం టాయిలెట్స్ వద్ద కనిపించని బోర్డు

అధికంగా వసూలు చేస్తున్నరు



అత్యవసరం మీద టాయిలెట్స్ వినియోగించుకుంటే రైల్వేస్టేషన్లో అధిక చార్జీలు వసూలు చేస్తున్నరు. దేనికెంత చెల్లించాలనే బోర్డు లేదు. నిర్వాహకులు ఎంత అడిగితే అంత ముందుగానే ఇవ్వాలి. లేదంటే బయటకు పొమ్మంటరు. అత్యవసరంలో మహిళల పరిస్థితి మరీ దారుణం.

– సంతోష్‌ప్రసాద్, ప్రయాణికుడు, మంచిర్యాల

మామిడిపై 'మంగు' పంజా



మంగు తెగులు సోకిన మామిడికాయలు

సాగుబడి

- అకాల వర్షాలు.. ఆశించిన చీడపీడలు
- కాయలపై మచ్చలతో తగ్గిన డిమాండ్
- దిగుబడి, ధర తగ్గి నష్టాల్లో రైతులు

నెన్నెల: ఈ ఏడాది మామిడిలో పూత ఆశాజనకంగా ఉన్నా పిందె పెరుగుదల దశలో తెగుళ్లు వెంటాడాయి. అకాల వర్షాలు తోడవడంతో కాయలు రాలాయి. మిగిలిన కాస్తా కాతకు మంగు మచ్చలేర్పడి చాలావరకు కాయలు కుళ్లి నేలరాలాయి. కాయలపై కూడా మంగు మచ్చలేర్పడగా ధర పూర్తిగా పడిపోయింది. టన్ను బంగినపల్లికి మామిడికి రూ.40 వేలు వస్తాయనుకున్న రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ప్రస్తుతం మంగు తెగులు కారణంగా మార్కెట్‌లో రూ.20వేల నుంచి రూ.22 వేల వరకే ధర ఉంది. పైగా మంగు మచ్చలేర్పడిన కాయల్లో పురుగులున్నాయని వినియోగదారుల ఫిర్యాదు మేరకు ధర ఇంకా కిందకు పడిపోయింది. మొత్తంగా ఈ ఏడాది మామిడి రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు.

పరిహారం అందించి ఆదుకోవాలి



గతేడాది నా ఆరెకరాల మామిడి తోట ద్వారా రూ.5 లక్షల ఆదాయం వచ్చింది. ఈసారి అకాల వర్షాల ద్వారా 30శాతం, మంగు తెగుళ్ల ద్వారా 30శాతం పంట నష్టం జరిగింది. మంగు మచ్చలున్న కాయలకు మార్కెట్‌లోనూ ధర లేక రూ.లక్షన్నర ఆదాయం మాత్రమే వచ్చింది. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

– జనార్దన్, ఆవుడం గ్రామం

ముందు జాగ్రత్తలే మేలు



జిల్లాలో మంగు తెగులు ఎఫెక్ట్ 30శాతం వరకు ఉంది. మంగు మచ్చలున్న కాయలకు మార్కెట్‌లో డిమాండ్ లేదు. పూత దశకంటే ముందే యాజమాన్య పద్ధతులు పాటించాలి. కోత అయిపోగానే కొమ్మ కత్తిరించి సూర్యరశ్మి పడేలా చూసుకోవాలి. సీజన్‌లో మందులు స్ప్రే చేయాలి. రైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవడమే మేలు.

– ఉదయ్‌కుమార్, జిల్లా ఉద్యానవన అధికారి

మార్లావాయి సర్పంచ్‌కు జీవ వైవిధ్య అవార్డు

నార్నూర్(జైనూర్): జైనూర్ మండలం మార్లావాయి గ్రామపంచాయతీ సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వరావు మంగళవారం హైదరాబాద్‌లోని భాస్కర ఆడిటోరియంలో రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజితకుమార్, రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు మెంబర్ ఆఫ్ సెక్రటరీ చరణ్‌దాస్ కర్తాడే చేతుల మీదుగా 'తెలంగాణ స్టేట్ బెస్ట్ బయోడైవర్సిటీ అవార్డు' (జీవవైవిధ్య)ను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మార్లావాయి గ్రామ పంచాయతీ పరిధిలో పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, ఇతర జీవాలను కాపాడడమే లక్ష్యంగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. పక్షులు, జంతువులు, వన్య మృగాలను వేటగాళ్ల నుంచి విముక్తి కల్పించడం కోసం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వందశాతం ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌కు కూరగాయల కోసం వెళ్లే వారికి ప్లాస్టిక్ రహిత బ్యాగులు అందజేసినట్లు తెలిపారు. గ్రామంలో ఇంకుడుగుంతల నిర్మాణం, జీవ వైవిధ్యంపై అవగాహన ర్యాలీలు నిర్వహించినట్లు వివరించారు. జీవామృతంతో సేంద్రియ వ్యవసాయంతో లాభాలు, మానవ మనుగడకు జీవవైవిధ్యం ఎంత అవసరమో ప్రజలకు తెలియజేసినట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలో చేపడుతున్న జీవవైవిధ్యం కార్యక్రమాలను గుర్తించి అవార్డుతో సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఆమె వెంట ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు ఉన్నారు.



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ ప్రతిభ వెంకటేశ్వర్‌రావు

రెక్కీ నిర్వహించి కలప వాహనం పట్టివేత

- ఎనిమిది మందిపై కేసు

జన్నారం: రెక్కీ నిర్వహించి కలప తరలిస్తున్న వాహనాన్ని అటవీ అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటన జన్నారం అటవీ డివిజన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇందన్‌పల్లి రేంజ్ అధికారి హఫీజొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని దేవునిగూడ గ్రామం నుంచి కలప తరలిపోతుందనే విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం సాయంత్రం డివిజన్‌లోని జన్నారం, ఇందన్‌పల్లి రేంజ్ అధికారి హఫీజొద్దీన్ ఆధ్వర్యంలో సిబ్బంది రెక్కీ నిర్వహించారు. మారువేషంలో రేండ్లగూడ, దేవునిగూడ, కిష్టాపూర్, జన్నారం ప్రాంతాల్లో కాపలా ఉన్నారు. సాయంత్రం ఎనిమిది గంటల ప్రాంతంలో పాతమామిడిపల్లికి చెందిన బొలెరో వాహనం రేండ్లగూడ నుంచి దేవునిగూడలోని లంబాడీతండాకు వెళ్లింది. లకావత్ హిరామన్ ఇంటిలో కలప లోడ్ చేసుకుని తిరిగి కిష్టాపూర్ మీదుగా జన్నారానికి వెళ్తోంది. ఈ సమయంలో కిష్టాపూర్ పంచాయతీ సమీపంలో అటవీ అధికారులు వాహనం అడ్డుగా పెట్టి బొలెరో వాహనాన్ని నిలిపివేశారు. వాహనంలోని కస్తూరి లచ్చయ్య, బత్తిని జనార్దన్‌తోపాటు వాహనాన్ని ఇందన్‌పల్లి అటవీరేంజ్‌కు తరలించారు. బొలెరో వాహనంలో 25 టేకు దుంగలుండగా విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని రేంజ్ అధికారి హఫీజొద్దీన్ తెలిపారు. కలప తరలింపులో పాల్గొన్న దండేపల్లి మండలం లింగాపూర్‌కు చెందిన బచ్చల సుభాష్, నంది సురేశ్, పాత మామిడిపెల్లికి చెందిన ఎల్తపు శ్రీనివాస్, కస్తూరి లచ్చయ్య, బత్తిని జనార్దన్, జన్నారం మండలం దేవునిగూడ లంబాడీతండాకు చెందిన లకావత్ హిరామన్, లకావత్ ఉపేందర్, లకావత్ వినోద్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దేవునిగూడ నుంచి ఇదివరకు మూడు లోడ్‌ల కలప గుట్టుచప్పుడు కాకుండా తరలివెళ్లగా, మూడోసారి పట్టుబడినట్లు తెలుస్తోంది. కాగా, బొలెరో వాహనం ద్వారా కలప తరలింపులో ఓ బీట్ అధికారి హస్తం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై అధికారులు లోతైన విచారణ జరిపితే పూర్తి వివరాలు తెలిసే అవకాశముంది.



వాహనంలో కలప

కార్మికులకు బెల్లంపల్లిలో క్వార్టర్లు కేటాయించాలి

బెల్లంపల్లి: ఏరియాలో పని చేస్తున్న కార్మికులకు బెల్లంపల్లిలో క్వార్టర్లు కేటాయించాలని హెచ్‌ఎంఎస్ సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ ఓజియార్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు ఎండీ గౌస్ సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఏరియాలోని బొగ్గు గనులు, విభాగాల్లో పని చేస్తున్న కార్మికులకు బెల్లంపల్లిలో క్వార్టర్లు కేటాయించడం లేదని తెలిపారు. స్టేషన్‌రోడ్ కాలనీ, నర్స్ క్వార్టర్స్ ఏరియాలోని కంపెనీ క్వార్టర్లపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అన్యాక్రాంతమవుతున్నాయని పేర్కొన్నారు. దురాక్రమణకు గురైన క్వార్టర్ల నుంచి అక్రమార్కులను తొలగించి ఏరియా ఆస్పత్రిలో పని చేస్తున్న వైద్యసిబ్బంది, కార్మికులకు కేటాయించాలని తెలిపారు. ఏరియా ఆస్పత్రిలో ఆర్థో, గైనిక్ విభాగాలను ప్రారంభించి కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు తగిన చికిత్స అందించాలని కోరారు. శాంతిఖని, కాసిపేట-1, 1ఏ, 2, కేకే ఓసీపీ గనులను బెల్లంపల్లి ఏరియాలో విలీనం చేసి ఏరియా ఆస్పత్రిని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. హెచ్‌ఎంఎస్ నాయకులు వెంకటస్వామి, అబ్దుల్ ఖాదర్, వినయ్‌కుమార్, మహేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

'కార్మికులకు అన్యాయం చేశారు'

శ్రీరాంపూర్: 11వ వేతన ఒప్పందంలో కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం చేశారని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షుడు డీ బ్రహ్మానందం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఫస్ట్ కేటగిరీ వేతనం చెల్లించాలని, ఇతర చట్టబద్ధహక్కులు కల్పించాలని చాలాకాలంగా పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. వేతన ఒప్పందంపై జాతీయ సంఘాల నేతలు ఎలాంటి చర్చ పెట్టకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. వీరిని నిలదీయాలని పిలుపునిచ్చారు.

వీవోఏలపై లాఠీచార్జి అమానుషం

బెల్లంపల్లి: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నల్గొండ కలెక్టరేట్‌ను ముట్టడించిన వీవోఏలపై పోలీసులు లాఠీచార్జి చేయడం అమానుషమని వీవోఏల సంఘం మండలాధ్యక్షుడు పొట్ట పోశం పేర్కొన్నారు. వీవోఏలపై జరిగిన లాఠీచార్జిని నిరసిస్తూ మంగళవారం బెల్లంపల్లి కాంటా చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 32 రోజులుగా సమ్మె చేస్తున్న వీవోఏల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. డిమాండ్లు నెరవేర్చాలని కలెక్టరేట్‌లోకి వెళ్తే అక్రమంగా అరెస్ట్ చేశారని, ఈతీరు అత్యంత గర్హనీయమని పేర్కొన్నారు. వీవోఏలపై లాఠీచార్జి, అరెస్ట్‌లను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వెంటనే వీవోఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీవోఏల సంఘం మండల కార్యదర్శి గాయత్రి, కోశాధికారి మహేశ్, వీవోఏలున్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న వీవోఏలు

గోదావరిలో పసిబిడ్డను విసిరేసి చంపిన తల్లి

- తానూ దూకబోతుండగా అడ్డుకున్న పోలీసులు
- నస్పూర్‌లోని నాగార్జున కాలనీలో విషాదం

శ్రీరాంపూర్: గోదావరిఖని బ్రిడ్జి పైనుంచి ఓ తల్లి తన రెండు నెలల పాపను గోదావరిలోకి విసిరేసి చంపింది. ఈ ఘటన నస్పూర్ నాగార్జున కాలనీలో విషాదాన్ని నింపింది. నాగార్జున కాలనీకి చెందిన భూక్య ప్రియాంక, రమేశ్ దంపతులకు రెండు నెలల పాప ఉంది. రమేశ్ ఆర్కే 7 గనిలో ఫిట్టర్‌గా పని చేస్తుండగా నాగార్జునకాలనీలోని శివాలయం సమీపంలోగల కంపెనీ క్వార్టర్‌లో నివాసముంటున్నారు. రమేశ్ స్వస్థలం ఇల్లందు. ప్రియాంక డెలివరీ కోసం పెద్దపల్లి జిల్లా రామగుండం పరిధిలోని సెంటినరీ కాలనీలోని తల్లిగారింటికి వెళ్లి అక్కడే ఉంటోంది. ఈక్రమంలో రెండు నెలల క్రితం పాప జన్మించింది. మంగళవారం పాపకు చికిత్స చేయించేందుకు గోదావరిఖనిలోని కంపెనీ ఆస్పత్రికి వచ్చింది. అక్కడి నుంచి సాయంత్రం నేరుగా గోదావరిఖని బ్రిడ్జి వద్దకు వచ్చి పైనుంచి నదిలో పాపను విసిరేసి చంపేసింది. తానూ దూకేందుకు యత్నించగా గమనించిన రివర్‌గార్డు పోలీసులు వెంటనే అడ్డుకుని ఆమెను రక్షించారు. కానీ.. పాప అప్పటికే చనిపోయింది. ప్రియాంకకు మతిస్థిమితం సరిగా లేదా.. పాపకు అనారోగ్యమేదైనా ఉంటే కలత చెంది ఇలా చేసిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఘటన జరిగిన కొద్ది సేపటికే సోషల్ మీడియాలో వైరలైంది.

మెరుగైన వేతన ఒప్పందం సాధించాం

శ్రీరాంపూర్: కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం సాధించామని ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి వీ సీతారామయ్య తెలిపారు. మంగళవారం ఆయన ఎస్సార్పీ 3, 3ఏ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. దేశంలో ఏ ప్రభుత్వ రంగ పరిశ్రమల్లోనూ ఇంత వేతనాలు పెరిగేలా ఒప్పందం కాలేదని తెలిపారు. మినిమం గ్యారెంటీ బెనిఫిట్ 19శాతం పెంపుదల, 25 శాతం అలవెన్సుల పెరుగుదలతో మొదటి కేటగిరీ వేతనం రూ.11 వేలకు వరకు పెరిగిందని పేర్కొన్నారు. ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీలు కూడా ఘనంగా పెరిగాయని చెప్పారు. ఈ వేతనాల పెంపుతో ప్రతీ జూనియర్ కార్మికుడికి రూ.2లక్షలు, సీనియర్‌కు రూ.4లక్షల వరకు ఎరియర్స్ వస్తాయని తెలిపారు. పెరిగిన వేతనాలు జూన్ 1నుంచి అమల్లోకి వస్తాయని, ఇది కార్మికుల ఘన విజయమని వివరించారు. సమావేశంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే బాజీసైదా, బ్రాంచ్ కార్యదర్శి ఎం.కొమురయ్య, పిట్ సెక్రటరీ మురళీచౌదరి, నాయకులు తొటం మల్లేశ్, సుధాకర్, ప్రభాకర్, అఫ్రోజ్‌ఖాన్, నామాల సురేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీతారామయ్య

నకిలీ విత్తనాలు, నిషేధిత గడ్డిమందు పట్టివేత

చింతలమానెపల్లి: మండలంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయి. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గూడెం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లో మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో నిషేధిత గడ్డి మందు, పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. మంచిర్యాల జిల్లా కన్నెపెల్లి మండలం దాంపూర్ గ్రామానికి చెందిన తలాండి రవి మహారాష్ట్ర నుంచి 12కిలోల బీటీ 3 పత్తి విత్తనాలు, గ్లైఫోసెట్ తెస్తూ పట్టుబడ్డాడు. వీటి విలువ రూ.20,280 ఉంటుంది. తనిఖీల్లో ఏఈవో విజయ్ ఉన్నారు.

దేశీదారు విక్రయిస్తున్న ఒకరి అరెస్ట్

మండలంలోని గూడెం గ్రామంలో దేశీదారు విక్రయిస్తున్న పూల్‌చంద్‌ను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు ఎక్సైజ్ సీఐ విలాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు గూడెం గ్రామంలో ఎక్సైజ్ సిబ్బంది ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని పూల్‌చంద్ ఇంటిలో అమ్మకం కోసం నిల్వ ఉంచిన 16కాటన్ల దేశీదారు లభించగా స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేశారు.



పట్టుకున్న దేశీదారు కాటన్లతో ఎక్సైజ్ అధికారులు

కన్నెపల్లిలో జ్వరాలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కన్నెపల్లి గ్రామంలో పలువురు జ్వరాల బారినపడ్డారు. గ్రామానికి చెందిన రాజం, సమ్మయ్య, మల్లయ్య, చంద్రయ్యతో పాటు పలువురు వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. కొందరు చెన్నూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఏ కారణంగా జ్వరాలు వస్తున్నాయో? అని వైద్య బృందం ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. అలాగే అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కన్నెపల్లిలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. వడదెబ్బ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అవసరమైతే గాని ఎండలో బయటకు వెళ్లవద్దని సూచించారు. నలుగురు జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు, గ్రామంలో తాగునీటి నమూనాలు సేకరించారు. శిబిరంలో జిల్లా ఆరోగ్యశాఖ పరిశీలకుడు సీహెచ్ రామ్మూర్తి, ఎపిడిమాలజిస్ట్ సుమన్, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యుడు ముస్తఫా, హెచ్‌ఈవో జగదీశ్, సబ్‌యూనిట్ అధికారులు నాందేవ్, పుట్ట సత్తయ్య, ఏఎన్ఎంలు రిబ్కా, హరిత, భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఆశ కార్యకర్తలు సువర్ణ, లత పాల్గొన్నారు.



కన్నెపల్లిలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ సిబ్బంది